సాక్షి నిజామాబాద్

గురువారం । 25 । సెప్టెంబర్ । 2025



డిపాజిట్ల పేరిట టోకరా..

డిపాజిట్ల పేరిట 125 మంది నుంచి రూ.8.5 కోట్లు వసూలు చేసిన ఇద్దరిని నిజామాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు.

- IIలో ▸



మోతాదుకు మించి..

మోతాదుకు మించి యూరియా వాడటంతో పంటలకు తెగుళ్లు సోకుతాయని జిల్లా వ్యవసాయాధికారి గోవింద్ అన్నారు.

- IIలో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
34.1 /21.8

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

కిలో బంగారం పట్టివేత

ఖలీల్‌వాడి: నిజామాబాద్ నగరంలో అక్రమంగా తరలిస్తున్న కిలో బంగారాన్ని పోలీసులు పట్టుకున్నారు. మూడో టౌన్ పోలీసులు బుధవారం తెల్లవారు జామున కంఠేశ్వర్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఆర్మూర్‌కు చెందిన బంగారు వ్యాపారులు సూర్యవంశీ సాంబాజీ, సురేష్ కారులో బంగారంతో పట్టుబడ్డారు. బంగారం కొనుగోలులో జీఎస్టీ కట్టినట్లు లేనందున, బంగారాన్ని వాణిజ్య పన్నుల శాఖ అధికారులకు గానీ జీఎస్టీ అధికారులకు గాని అప్పగిస్తామని ఎస్సై హరిబాబు తెలిపారు. బంగారం విలువ సుమారు రూ. 1.10 కోట్లు ఉంటుందన్నారు. ఏసీపీ రాజావెంకట్ రెడ్డి విచారించినట్లు తెలుస్తోంది. వ్యాపారులు బంగారాన్ని నాందేడ్ నుంచి ఆర్మూర్‌కు తరలిస్తున్నారు.

జీజీహెచ్‌లో హైరిస్క్ గర్భిణీకి ప్రసవం

- సకాలంలో స్పందించి.. ప్లేట్‌లెట్ కౌంట్‌ను పెంచి..



నిజామాబాద్‌నాగారం: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో హైరిస్క్‌లో ఉన్న గర్భిణీకి వైద్యులు ప్రసవం చేశారు. కోటగిరికి చెందిన 23 ఏళ్ల సిమ్రాన్‌బేగం ప్లేట్‌లెట్స్ తక్కువగా ఉండి బాధపడుతుండడంతో కుటుంబ సభ్యులు మంగళవారం ఉదయం జీజీహెచ్‌కు తీసుకొచ్చారు. 37 వారాల 4 రోజుల గర్భంతో ఉండి ప్రసవ వేదను అనుభవిస్తున్న సిమ్రాన్‌బేగంకు జీజీహెచ్ వైద్యులు రెండు యూనిట్ల ఆర్డీపీ, ఒక యూనిట్ ఎస్డీపీ ప్లేట్‌లెట్ ట్రాన్స్‌ఫ్యూషన్ ఇచ్చారు. ఆ తరువాత ఆమెకు ప్లేట్‌లెట్ కౌంట్ 57,000కు పెరిగింది. వైద్య బృందం సకాలంలో స్పందించి సిమ్రాన్‌బేగంకు చికిత్స అందించడంతో ఆమె మొదటికాన్పులో పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీ బిడ్డల ప్రాణాలను రక్షించిన హౌస్ సర్జన్ హేమంత్, వైద్యులు లక్ష్మీప్రసన్న, హారిక, ఆశ్రిత, రమ్య, రశ్మితకు సిమ్రాన్ బేగం భర్త మహ్మద్ రసూల్‌తోపాటు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

పనులు వేగంగా పూర్తి చేయండి

- వచ్చే నెలలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీ
- కార్పొరేషన్ ప్రత్యేకాధికారి, కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి సమీక్ష

నిజామాబాద్ సిటీ : నగరంలోని నాగారంలో, కొత్త కలెక్టరేట్ వెనుక భాగంలో నిర్మాణంలో ఉన్న డబుల్ బెడ్ రూం ఇళ్ల పనులు వేగవంతంగా చేయాలని జిల్లా కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం బల్దియా కార్యాలయంలో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. నాగారంలో ఇదివరకే నిర్మించిన ఇండ్లను వాడుకలోకి తెచ్చేలా ఈ నెలాఖరులోగా మరమ్మతులు పూర్తి చేయాలన్నారు. వచ్చే నెల మొదటి వారంలో ఇళ్లు పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. టెండర్ల ప్రక్రియ పూర్తిచేసి డబుల్ రూమ్ ఇళ్ల పనులు నాణ్యతతో చేపట్టాలని సూచించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్, హౌ సింగ్ పీడీ నివర్తి, ఆర్‌అండ్‌బీ డీఈ, ఏఈలు ఇతర అధికారులు పాల్గొన్నారు.



శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి 40 గేట్ల ద్వారా దిగువకు విడుదలవుతున్న వరద నీరు

నవీపేట మండలం యంచ శివారులో ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి



రికార్డుల వరద

ఈ ఏడాది గోదావరి, మంజీర ఉగ్రరూపం దాల్చాయి. భారీ వర్షాల కారణంగా నదుల్లో నీటి ప్రవాహ ఉధృతి తగ్గడం లేదు. మహారాష్ట్ర నుంచి గోదావరి, సింగూరు నుంచి మంజీర పరవళ్లు తొక్కుతూ వస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలోని నిజాంసాగర్, శ్రీరాంసాగర్ ప్రాజెక్టులకు గతంలో ఎన్నడూ లేని విధంగా ఇన్‌ఫ్లో వస్తుండగా.. జలాశయాల నుంచి నీటి విడుదల రికార్డు స్థాయిలో కొనసాగుతోంది. లక్షల క్యూసెక్కుల ఇన్ ఫ్లో, అవుట్ ఫ్లో కారణంగా ఎస్సారెస్పీ ఎగువ, దిగువన పంటలకు ముంపు ముప్పు తప్పడం లేదు. ఇన్ ఫ్లో భారీగా ఉండొచ్చనే అంచనాలతో ఎస్సారెస్పీ అధికారులు ప్రాజెక్టు నీటి నిలువను 58 టీఎంసీలకు తగ్గించారు.

ముంపు ముప్పు

- ఎస్సారెస్పీ ఎగువ.. దిగువ అదే పరిస్థితి
- 40 గేట్ల ద్వారా దిగువకు నీటి విడుదల
- రెండు రోజుల్లో 27 టీఎంసీలు..
- మహారాష్ట్రలో భారీ వర్షాలతో పోటెత్తుతున్న వరద

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాలతో గోదావరి పోటెత్తింది. శ్రీరాంసాగర్ జలాశయానికి ఎగువ, దిగువ ఉన్న ప్రాంతాల్లో పంటలు నీట మునుగుతున్నాయి. ఎగువ నుంచి ఎస్సారెస్పీలోకి రెండు రోజుల వ్యవధిలో 15 టీఎంసీల వరద రాగా, 27 టీఎంసీల నీటిని దిగువకు వదిలారు. అందులో నికర జలాల నుంచి 22 టీఎంసీలు దిగువకు వెళ్లాయి. రెండు రోజుల క్రితం వరకు ఎస్సారెస్పీ పూర్తి సామర్థ్యంతో 80 టీఎంసీల నీటితో నిండుకుండలా ఉంది. అయితే బుధవారం సాయంత్రానికి 58 టీఎంసీల నీరు మాత్రమే మిగిలింది. ఎగువ నుంచి 2,54,230 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, 4,01,017 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఇందులో 40 వరద గేట్ల ద్వారా 3,85,160 క్యూసెక్కులు కిందికి వెళుతున్నాయి. మిగిలిన నీటిని కాకతీయ, సరస్వతి, లక్ష్మి కాలువల ద్వారా, లిఫ్ట్ ఇరిగేషన్ స్కీములు, మిషన్ భగీరథ కోసం, ఎస్కేప్ గేట్ల ద్వారా వదులుతున్నారు. శ్రీరాంసాగర్ జలాశయంలోకి ఈ ఏడాది జూన్ నుంచి ఇప్పటివరకు 553 టీఎంసీల ఇన్‌ఫ్లో వచ్చింది. ఇందులో నుంచి ఇప్పటివరకు 503 టీఎంసీల నీటిని దిగువకు వదిలారు. ప్రస్తుతం మహారాష్ట్రలోని గైక్వాడ్, విష్ణుపురి, బాబ్లీ తదితర ప్రాజెక్టుల గేట్లు ఎత్తేయడంతో భారీగా వరద వస్తోంది.

ఎస్సారెస్పీ వరద గేట్ల ద్వారా 4 లక్షల క్యూసెక్కులకు మించి నీటిని కిందికి వదిలితే, దిగువన ఉన్న గోదావరి పరీవాహక ప్రాంతాలైన మెండోరా మండలంలోని దూద్‌గాం, చాకిర్యాల్, కోడిచర్ల, సావెల్, ఏర్గట్ల మండలం గుమ్మిర్యాల్, దోంచంద ప్రాంతాల్లో పంటలు నీట మునుగుతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. అదేవిధంగా శ్రీరాంసాగర్ ఎగువ మహారాష్ట్ర నుంచి గోదావరికి, కందకుర్తి వద్ద గోదావరిలో కలిసే మంజీర నది నుంచి సైతం భారీగా నీరు వస్తోంది. దీంతో ఎస్సారెస్పీ జలాశయం ఎగువన ఉన్న నవీపేట, నందిపేట, డొంకేశ్వర్, రెంజల్, బోధన్ మండలాల్లోని పలు గ్రామాల్లో పంటలు నీట మునుగుతున్నాయి. రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎగువ నుంచి భారీగా వస్తున్న వరద నేపథ్యంలో గరిష్ట స్థాయిలో నీటిని వదులుతున్నారు. దిగువ ప్రాంతాలతోపాటు బ్యాక్‌వాటర్ ప్రాంతంలోనూ వరద ముప్పు తప్పడం లేదు.



కందకుర్తి వద్ద వంతెనకు అవతలి వైపు రోడ్డును మూసేసిన మహారాష్ట్ర పోలీసులు



సాలూర శివారులోని పాత వంతెన మీదుగా ప్రవహిస్తున్న మంజీర

ముంపు తప్పించేందుకు..

బాల్కొండ: ఎగువ ప్రాంతాల్లో ముంపు ముప్పును తప్పించేందుకు ఎస్సారెస్పీ అధికారులు భారీగా నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. బుధవారం రాత్రి సమయానికి ప్రాజెక్ట్ నీటి నిల్వ 56 టీఎంసీలకు చేరింది. ఎగువ నుంచి వరద ప్రవహం వేగంగా రావడానికే ప్రాజెక్ట్‌ను ఖాళీ చేస్తున్నట్లు ప్రాజెక్ట్ అధికారులు తెలుపుతున్నారు. అయినప్పటికీ ఎగువ ప్రాంతాల్లో బ్యాక్ వాటర్‌నిలిచే ప్రాంతాలు ముంపునకు గురి కావడం ప్రాజెక్ట్ అధికారులను సైతం ఆందోళనకు గురి చేస్తోంది. ప్రస్తుత సంవత్సరం ఎందుకిలా జరుగుతుందో తమకు కూడా అర్థం కావడం లేదని అధికారులు అంటున్నారు.

కాలువల ద్వారా..

ప్రాజెక్ట్ నుంచి వరద కాలువ ద్వారా 6,735 క్యూసెక్కులు, కాకతీయ కాలువ ద్వారా 5,500, ఎస్కేప్ గేట్ల ద్వారా 2,500, లక్ష్మి కాలువ ద్వారా 200, సరస్వతి కాలువ ద్వారా 400, అలీసాగర్ లిఫ్ట్ ద్వారా 180 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. మిషన్‌భగీరథ అవసరాలకు 231 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తుండగా, ఆవిరి రూపంలో 709 క్యూసెక్కుల నీరుపోతోంది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా బుధవారం రాత్రి సమయానికి 1083.00(56టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని అధికారులు తెలిపారు.

గోదావరి ఉగ్రరూపం

- యంచ శివార్లలో నీట మునిగిన పంటపొలాలు
- కందకుర్తిలో ఆశ్రమం చుట్టూ చేరిన నీరు.. చిక్కుకున్న ఐదుగురు
- సురక్షితప్రదేశానికి తరలింపు




ఆశ్రమంలో చిక్కుకున్న వారిని సురక్షితంగా ట్రాక్టర్‌లో తరలిస్తున్న పోలీసులు

బోధన్/రెంజల్/నవీపేట/రుద్రూర్: గోదావరి, మంజీర నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఇటు నిజాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి నీటిని విడుదల చేస్తుండగా, అటు మహారాష్ట్ర నుంచి భారీ వరద వస్తుండడంతో కందకుర్తి వద్ద త్రివేణి సంగమం నుంచి గోదావరి పోటెత్తింది. అంతర్రాష్ట్ర వంతెన పైనుంచి నీరు ప్రవహిస్తుండడంతో మహారాష్ట్ర–తెలంగాణమధ్య రాకపోకలు నిలిచిపోయాయి. నవీపేట మండలం కోస్లి, యంచ, అల్జాపూర్, నందిగామ శివార్లలో పంటలు నీట మునిగాయి. కందకుర్తి పుష్కరక్షేత్రంలోని సీతారాంత్యాగి ఆశ్రమం చుట్టూ వరద నీరు చేరింది. స్థానికుల సహకారంతో బోధన్ ఏసీపీ శ్రీనివాస్‌తోపాటు తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, పోలీసు సిబ్బంది ట్రాక్టర్‌లో ఆశ్రమానికి చేరుకొని సీతారాం త్యాగితోపాటు మరో నలుగురిని సురక్షితంగా రామాలయానికి చేర్చారు. సహకరించిన స్థానికుడు సిరాజ్‌బేగ్‌తోపాటు మరికొందరిని అధికారులు అభినందించారు. పొతంగల్, సాలూర, బోధన్ మండలాల పరిధిలో మంజీర ఉధృతంగా ప్రవహిస్తోంది. పంటలు మళ్లీ నీట మునిగే ప్రమాదం పొంచి ఉంది. మరో రెండు రోజుల వరకు వరద తగ్గే అవకాశాలు లేవని, అప్రమత్తంగా ఉండాలని అధికారులు గ్రామాల్లో దండోరా వేయించారు.

నిజాంసాగర్‌కు..

- ఈ సీజన్‌లో ప్రాజెక్టులోకి 180 టీఎంసీల ఇన్‌ఫ్లో
- నెల రోజుల్లో గేట్ల ద్వారా 166 టీఎంసీలు విడుదల
- ఒకరోజు గరిష్ట ఇన్‌ఫ్లో 2.50 లక్షల క్యూసెక్కులు
- 40 ఏళ్లలో ఇదే అత్యధికమంటున్న అధికారులు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : ఉమ్మడి జిల్లా వరప్రదాయిని వందేళ్ల చరిత్ర ఉన్న నిజాంసాగర్ ప్రాజెక్టులోకి ఈసారి ఊహించని రీతిలో వరద వచ్చి రికార్డుల మీద రికార్డులు సృష్టించింది. ఈ సీజన్‌లో ఇప్పటివరకు 180 టీఎంసీల నీరు వచ్చి చేరిందని నీటి పారుదల శాఖ అధికారుల లెక్కలు చెబుతున్నాయి. ఈ స్థాయిలో నీరు వచ్చింది ఇదే మొదటిసారని అధికారులు పేర్కొంటున్నారు. మంజీరపై సింగూరు వద్ద బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మించక ముందు ఎప్పుడో వరద వచ్చిందని, గడిచిన నలభై ఏళ్లలో ఈ స్థాయిలో ఇన్‌ఫ్లో, అవుట్ ఫ్లో లేదని చెబుతున్నారు. గతనెల 18 న ప్రాజెక్టు వరద గేట్ల ద్వారా నీటిని వదలడం మొదలవగా మధ్యలో ఒకటి రెండు రోజులు మినహా నేటి వరకు వదులుతూనే ఉన్నారు. ఇప్పటివరకు 166 టీఎంసీల నీటిని వరద గేట్ల ద్వారా దిగువకు వదిలారు. నిజాంసాగర్ ప్రాజెక్టుకు నాలుగు దశాబ్దాల కాలంలో ఈసారి వచ్చిన ఇన్‌ఫ్లోనే అత్యధికమైనదని నీటి పారుదల శాఖ అధికారులు పేర్కొంటున్నారు. గతనెల 28న నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 2,50,912 క్యూసెక్కుల నీరు వచ్చింది. దీంతో 2.20 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. ఒక రోజులో ఈ స్థాయిలో ఇన్‌ఫ్లో రావడం, అవుట్ ఫ్లో వెళ్లడం ఇదే మొదటిసారి అధికారులు తెలిపారు. సింగూరు నుంచి మంజీర పరవళ్లు తొక్కుతూ రాగా.. పోచారం ప్రాజెక్టు నుంచి కూడా భారీ వరద వచ్చింది.



నిజాంసాగర్ ప్రాజెక్టు గేట్ల ద్వారా పరవళ్లు తొక్కుతున్న మంజీర

ఎప్పుడూ లేనంతగా..

నిజాంసాగర్ ప్రాజెక్టుకు గతంలో ఎన్నడూ లేనంతగా ఇన్‌ఫ్లో వచ్చింది. దాదాపు అదే స్థాయిలో నీటిని దిగువకు వదిలాం. దాదాపు నలభై ఏళ్ల చరిత్రలో ఇదే ఎక్కువ ఇన్‌ఫ్లో, అవుట్ ఫ్లో. ఎప్పటికప్పుడు ఇన్‌ఫ్లోను, ప్రాజెక్టును పర్యవేక్షిస్తూ ఎక్కడా నష్టం జరగకుండా చర్యలు తీసుకున్నాం. ఎగువన అలాగే దిగువన ముంపు సమస్య తలెత్తకుండా ప్రజల్ని అప్రమత్తం చేశాం.

– టి.శ్రీనివాస్, చీఫ్ ఇంజినీర్, కామారెడ్డి

రైతుల్లో వరుణ భయం!

- పంట దిగుబడిని ఎండబెట్టలేని పరిస్థితి
- కల్లాల్లోనే టార్పాలిన్లు కప్పి ఉంచుతున్న రైతులు

డొంకేశ్వర్(ఆర్మూర్): వర్షాలు రైతుల కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. మొన్నటి వరకు భారీ వర్షాలతో పంటలు దెబ్బతినగా, ఇప్పుడేమో చేతికందిన మక్క, సోయా దిగుబడులను ఆరబోయనీయకుండా వరుణుడు ప్రతాపం చూపిస్తున్నాడు. ఎప్పుడొస్తుందో తెలియని వర్షం నుంచి పంటలను కాపాడుకునేందుకు రైతులు కల్లాల వద్దే పడిగాపులు కాస్తున్నారు. తడవకుండా పంట కుప్పలపై టార్పాలిన్లు కప్పి రోజుల తరబడి ఉంచుతున్నారు. వర్షాకాలం సీజన్‌లో జిల్లాలో 52,093 ఎకరాల్లో మొక్కజొన్న, 33,603 ఎకరాల్లో సోయా సాగు చేశారు. పంటలు చేతికొచ్చిన సమయంలో వర్షాలు కురుస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సోయా కోతలను వాయిదా వేస్తున్నారు. జిల్లాకు మర్ని కొన్ని రోజులు వర్షసూచన ఉండడంతో రైతులు కల్లాల వద్దే ఉంటున్నారు. తడిసిన పంటలను వ్యాపారులు కొనుగోలు చేయడం లేదని అంటున్నారు. మక్కలను ఆరబో సేందుకు వారం రోజుల క్రితం తీసుకు వచ్చానని, వర్షం కారణంగా ఇప్పటికీ ఆరబోయ లేదని తొండాకూర్ గ్రామానికి చెందిన రైతు గంగాదాస్ 'సాక్షి'తో తెలిపారు. టార్పాలిన్‌లు కప్పి ఉంచానన్నారు.



డొంకేశ్వర్ మండలం తొండాకూర్‌లో కల్లాల్లో పోసిన మక్క కుప్పలపై కప్పిన టార్పాలిన్లు

వరి కోతలు షురూ..

- వర్ని ప్రాంతంలో చేతికొచ్చిన పంట
- వాతావరణం అనుకూలించక వ్యాపారులకు ధాన్యం విక్రయం
- క్వింటాల్‌కు రూ.2,150 ధర

వర్ని: రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా జిల్లాలోని వర్ని ప్రాంతంలో వరి కోతలు ప్రారంభమయ్యాయి. ఈ ప్రాంత రైతులు మే మొదటి వారంలో నారుమడులను సిద్ధం చేసి జూన్ మొదటి వారంలో నాట్లు పూర్తి చేశారు. దీంతో సెప్టెంబర్ నాలుగో వారం నుంచి కోతలు ప్రారంభమయ్యాయయి. ఉమ్మడి వర్ని మండలంలో 15 రోజుల్లో సుమారు 30శాతం పంట కోతకు రానుంది. బుధవారం మండలంలోని శ్రీనగర్ గ్రామానికి చెందిన నేమాని రవి తాను 11 ఎకరాల్లో సాగు చేసిన వరి కోతను ప్రారంభించారు. ధాన్యాన్ని వెంటనే ప్రైవేట్ వ్యాపారికి విక్రయిస్తున్నానని, క్వింటాల్‌కు రూ.2,150 చెల్లిస్తున్నారని తెలిపారు. 1638 రకం సాగు చేయగా ఎకరానికి 45 క్వింటాళ్ల దిగుబడి వచ్చినట్లు తెలిపారు. పంట చేతికొస్తున్న తరుణంలో ఉమ్మడి వర్ని, కోటగిరి, బోధన్ మండలాల్లో వెంటనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేకపోతే వాతావరణ పరిస్థితులను, రైతుల అవసరాలను ఆసరా చేసుకుని దళారులు సొమ్ము చేసుకునే ప్రమాదం ఉంది.



వరి కోస్తున్న హార్వెస్టర్లు



ధాన్యాన్ని లారీలో లోడ్ చేస్తున్న హమాలీలు

ప్రైవేట్ వ్యాపారికి విక్రయిస్తున్నా..

వరి పంట చేతికొచ్చింది. అయితే వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో వెంటనే ప్రైవేట్ వ్యాపారికి విక్రయిస్తున్నా. ప్రభుత్వం చెల్లించే గిట్టుబాటు ధరతోపాటు బోనస్ ఇవ్వడంతో మంచి ధర వస్తున్నప్పటికీ వాతావరణం అనుకూలంగా లేదు. వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తే బాగుంటుంది. – నేమాని రవి, రైతు, శ్రీనగర్

ఏసీపీతో 'సాక్షి' ఫోన్‌ఇన్



దసరా సెలవుల్లో ఊరెళ్తున్నారా.. అయితే ఇళ్లు జాగ్రత్త! చోరీలకు అవకాశం లేకుండా మీరు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పోలీసులకు సమాచారం ఇవ్వడం, ప్రయాణాల్లో బ్లాక్ స్పాట్స్ వద్ద, నైట్ జర్నీలో ఇబ్బందులు కలగకుండా సలహాలు, సూచనల కోసం సాక్షి నిజామాబాద్ ఏసీపీ రాజావెంకట్ రెడ్డితో ఫోన్‌ఇన్ కార్యక్రమం నిర్వహిస్తోంది. మీరు ఫోన్ చేసి సలహాలు పొందవచ్చు.

తేది : 26-09-2025 (శుక్రవారం)
సమయం: ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు..

ఫోన్ నం : 87126 59807, 99484 03753

పకడ్బందీగా ధాన్యం సేకరణ

- జిల్లాలో 663 కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు
- మోడల్ సెంటర్లను ఏర్పాటు చేయండి
- అక్రమాలకు పాల్పడితే క్రిమినల్ కేసులు
- సన్నాహక సమావేశంలో కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి దిశానిర్దేశం

నిజామాబాద్ అర్బన్: వానాకాలం సీజన్‌కు సంబంధించిన ధాన్యం సేకరణకు పకడ్బందీ ఏర్పాటు చేయాలని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి అన్నారు. ధాన్యం సేకరణ సజావుగా సాగేలా సంబంధిత అధికారులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, రైస్‌మిల్లర్లు అంకితభావంతో కృషి చేయాలన్నారు. వానాకాలం (2025–2026) సీజన్ ధాన్యం సేకరణపై సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, సంబంధిత శాఖల అధికారులు, మహిళా సంఘాల ప్రతినిధులు, రైస్‌మిల్లర్లు హాజరయ్యారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, పాల్గొన్న అధికారులు

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అక్టోబర్‌లో కొనుగోలు కేంద్రాలను రైతులకు అందుబాటులోకి తీసుకురానున్న నేపథ్యంలో అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. రైతులను నష్టపర్చే చర్యలను ఉపేక్షించబోమని, అక్రమాలకు పాల్పడే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని హెచ్చరించారు. ఈ సీజన్‌లో లక్షా 76 వేల హెక్టార్ల విస్తీర్ణంలో వరి సాగు చేయగా, సుమారు 12.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశామని, ఇందులో సన్న రకం ధాన్యం అత్యధికంగా 11 లక్షల మెట్రిక్ టన్నులు ఉంటుందన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న సెంటర్లకు సుమారు 9 లక్షల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా 663 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రైతులు నాణ్యతాప్రమాణాలకు లోబడి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి, పూర్తిస్థాయి మద్దతు ధర పొందేలా విస్తృత అవగాహన కల్పించాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో 'ఏ' గ్రేడ్ రకం ధాన్యానికి క్వింటాల్‌కు రూ.2,389, సాధారణ రకానికి రూ.2,369 చెల్లించడం జరుగుతుందన్నారు. మద్దతు ధరతోపాటు సన్నాలకు ప్రభుత్వం బోనస్ అందిస్తోందని గుర్తు చేశారు. కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రయోగాత్మకంగా మోడల్ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. వర్ష సూచనలపై వాతావరణ శాఖ ముందస్తుగానే అందించే సమాచారాన్ని ఈసారి కొనుగోలు కేంద్రాల్లో కూడా తెలుసుకునే వెసులుబాటు కల్పిస్తున్నారని, ఈ సమాచారాన్ని ఎప్పటికప్పుడు రైతులకు తెలియజేస్తూ అప్రమత్తం చేయాలన్నారు. సేకరించిన ధాన్యాన్ని వెంటవెంటనే రైస్ మిల్లులకు తరలించేలా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. నిర్ణీత కాలంలో రైతుల బ్యాంకు ఖాతాల్లో ధాన్యం డబ్బులు జమయ్యేలా చొరవ చూపాలన్నారు. సబ్ కలెక్టర్లు వికాస్ మహతో, అభిగ్యాన్ మాల్వియ, ట్రెయినీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావి, డీఆర్డీవో సాయాగౌడ్, డీఎస్‌వో అరవింద్‌రెడ్డి, సివిల్ సప్లయీస్ డీఎం శ్రీకాంత్‌రెడ్డి, డీసీవో శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోవిందు, మార్కెటింగ్ శాఖ అధికారిణి గంగుబాయి, జిల్లా రవాణా శాఖ అధికారి ఉమామహేశ్వర్ రావు, రైస్ మిల్లర్ల సంఘం ప్రతినిధులు, సహకార సంఘాల సీఈవోలు, మహిళా సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

స్వస్థ్ నారీ - సశక్త్ పరివార్ శిబిరం తనిఖీ



మాక్లూర్: మండలంలోని కల్లెడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహిస్తున్న స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ వైద్య శిబిరాన్ని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి రాజశ్రీ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. శిబిరంలో 91 మంది మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు పీహెచ్‌సీ డాక్టర్ ప్రకాశ్ కుమార్ వివరించారు. పిల్లల వైద్యుడు రాజ్‌కుమార్, కంటి వైద్యుడు సందీప్‌లు వేర్వేరుగా ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి పిల్లలు, వృద్ధులకు పరీక్షలు చేసి తగిన సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తీర్ణ అధికారి ప్రవీణ్‌రెడ్డి, నర్సింగ్ అధికారి నారాయణ, ఫార్మసీ అధికారి పద్మ, సూపర్‌వైజర్లు ప్రభాకర్, సుమతి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

శ్రీవిష్ణు సూపర్ స్పెషాలిటీలో అరుదైన చికిత్స



నిజామాబాద్‌నాగారం: నగరంలోని శ్రీవిష్ణు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వైద్యులు అరుదైన చికిత్స చేశారు. కమ్మర్‌పల్లి మండలంలోని బషీరాబాద్ గ్రామానికి చెందిన రాజేందర్ కొన్ని రోజులుగా డెంగీతో బాధపడుతూ పలు ఆస్పత్రుల్లో చూయించుకున్నాడు. డెంగీ తగ్గకపోగా, అతడి ఆరోగ్యం క్షీణించి అపస్మారకస్థితిలో శ్రీవిష్ణు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి వచ్చారు. జనరల్ ఫిజిషియన్ లక్ష్మీరెడ్డి, రాజేందర్‌ను పరీక్షించి బ్రెయిన్, స్పైనల్‌కార్డుకు డెంగీ వ్యాపించినట్లు గుర్తించారు. వెంటిలేటర్‌పై డాక్టర్ రమణేశ్వర్, డాక్టర్ విఠల్ ఇతర వైద్య బృంద సహాయంతో చికిత్స అందించారు. దీంతో ప్రస్తుతం రాజేందర్ పూర్తిగా కోలుకున్నాడు. శ్రీవిష్ణు సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్య బృందానికి రుణపడి ఉంటామని పేషెంట్ తల్లిదండ్రులు తెలిపారు.

మెప్మా పీడీ రాజేందర్ బదిలీ

నిజామాబాద్ సిటీ: మెప్మా పీడీ రాజేందర్ బదిలీ అయ్యారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం సీడీఎంఏ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆయనను సంగారెడ్డి ఆర్డీవోగా నియమించారు. రెవెన్యూ విభాగానికి చెందిన రాజేందర్ తహసీల్దార్‌గా విధులు నిర్వహించారు. తర్వాత పదోన్నతిపై మెప్మా పీడీగా నియమించడంతో దాదాపు రెండేళ్లు పనిచేశారు.

ఆక్రమణల తొలగింపు

ఖలీల్‌వాడి: నగరంలోని తిలక్‌గార్డెన్ కాంప్లెక్స్‌లో ఫుట్‌పాత్‌పై ఏర్పాటు చేసిన వ్యాపార సముదాయాల ఫ్లెక్సీలను ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం తొలగించారు. ఫుట్‌పాత్‌పై వ్యాపారం చేస్తుండడంతో ప్రజలు, వాహనాదారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాగా, ఓ హోటల్ ముందు ఉన్న వస్తువులను ట్రాఫిక్ పోలీసులు తొలగించకపోవడం చర్చనీయాంశంగా మారింది.

ఇళ్ల నిర్మాణాల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు



జక్రాన్‌పల్లిలో అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి



సమావేశానికి హాజరైన అధికారులు

- కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి
- ఇందిరమ్మ ఇళ్ల పురోగతిపై సమీక్ష

జక్రాన్‌పల్లి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి హెచ్చరించారు. జక్రాన్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్ల పురోగతిపై ఎంపీడీవో, ఎంపీవో, హౌసింగ్ ఏఈ, జీపీ కార్యదర్శులతో బుధవారం కలెక్టర్ సుదీర్ఘ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలలో స్పష్టమైన పురోగతి కనిపించేలా క్షేత్రస్థాయిలో చిత్తశుద్ధితో కృషిచేయాలని అధికారులను ఆదేశించారు. ఒక్కో గ్రామంలో మంజూరైన ఇళ్లు ఎన్ని, వాటిలో ఎన్ని గ్రౌండింగ్ అయ్యాయి, ఎన్ని ఇళ్లు ఏ దశలో ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. ఇళ్ల నిర్మాణాలలో వెనుకంజలో ఉన్న గ్రామ కార్యదర్శులపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. నిర్దేశిత లక్ష్యాల సాధనకు స్పష్టమైన దిశానిర్దేశం చేస్తున్నప్పటికీ ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రశ్నించారు. మంజూరైన లబ్ధిదారులు తక్షణమే ఇళ్ల నిర్మాణాలు చేపట్టేలా లబ్ధిదారులను ప్రోత్సహిస్తూ పక్కాగా పర్యవేక్షణ చేయాలని సూచించారు. దసరా పండుగ లోపు అన్ని ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభమయ్యేలా చొరవ చూపాలన్నారు. నిర్మాణ దశల మేరకు లబ్ధిదారుల ఖాతాలలో బిల్లులు జమ చేస్తున్నామని గుర్తుచేశారు. అర్హులు నిర్మాణం చేపట్టేలా ఇందిరమ్మ కమిటీల సహకారం తీసుకోవాలన్నారు. కొందరు కార్యదర్శులు సాంకేతిక సమస్యలను కలెక్టర్ దృష్టికి తేగా రాష్ట్ర హౌసింగ్ ప్రధాన కార్యాలయ అధికారులను ఫోన్ ద్వారా సంప్రదించి సమస్యల ను పరిష్కరింపజేశారు. ఎంపీడీవో సతీశ్‌కుమార్, ఎంపీవో యూసుఫ్‌ఖాన్, కార్యదర్శులు పాల్గొన్నారు.

పర్యాటకులకు తప్పని తిప్పలు



ప్రాజెక్ట్ పైకి అనుమతించకపోవడంతో గేట్ వద్ద పర్యాటకులు

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ అందాలను తిలకించేందుకు వస్తున్న పర్యాటకులకు తిప్పలు తప్పడం లేదు. ఎంతో ఆశతో వచ్చిన పర్యాటకులు డ్యాంపైకి వెళ్లేందుకు అధికారులు అనుమతివ్వడం లేదు. దీంతో నిరాశగా వెనుదిరుగుతున్నారు. ప్రాజెక్టుపైకి అనుమతివ్వకపోవడంతో దిగువన గోదావరి అంచునకు వెళ్తున్నారు. దీంతో పర్యాటకులు ప్రమాదాల బారినపడే ఆస్కారం ఉంది.

వరుస కట్టి.. చేపలు పట్టి..



గోదావరి అంచున చేపలు పడుతున్న మత్స్యకారులు

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ వరద గేట్ల నీటి ప్రవాహం ముందర గోదావరిలో మత్స్యకారులు వరుస కట్టి ఒకరి తర్వాత ఒకరు వల వేస్తూ చేపలు పడుతున్నారు. గోదావరిలోకి భారీగా నీటి విడుదల కొనసాగుతుండటంతో చేపలు ఎక్కువ సంఖ్యలో కొట్టుకుపోతున్నాయి. దీంతో మత్స్యకారులు చేపల వేటకు క్యూ కడుతున్నారు.

పశువుల షెడ్లు శుభ్రంగా ఉంచాలి

- జిల్లా పశువైద్యాధికారి రోహిత్ రెడ్డి



పశువులకు చికిత్స చేస్తున్న జిల్లా పశువైద్యాధికారి రోహిత్ రెడ్డి

నిజామాబాద్ రూరల్: వర్షాకాలం దృష్ట్యా పాడి రైతులు పశువుల పెంపకంలో జాగ్రత్తలు పాటించాలని జిల్లా పశువైద్యాధికారి రోహిత్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని జలాల్‌పూర్ గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత పశువైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రోహిత్ రెడ్డి మాట్లాడుతూ.. పశువులు పెంచుకునే స్థలాన్ని ఎప్పటికప్పుడు శుభ్రపరుచుకోవాలన్నారు. పశువులకు పౌష్టికాహారాన్ని అందిస్తే అవి ఆరోగ్యకరంగా ఉంటాయన్నారు. గ్రామంలో మొత్తం 57 పశువులకు చికిత్స చేసి, పాడి రైతులకు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి బాబూరావు, నరేందర్, వీఎల్‌వో రమేశ్, భాస్కర్, శ్రీనివాస్, నరేశ్, అస్రఫ్, గంగారాం, మాజీ సర్పంచ్ నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

డెర్మటాలజీ క్విజ్‌లో ద్వితీయస్థానం



సూర్య, శశాంత్‌లను అభినందిస్తున్న జీజీహెచ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్

నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ ప్రభుత్వ వైద్య కళాశాల ఫైనలియర్ విద్యార్థులు బోయిండల సూర్య, శశాంత్ కుమార్ జాతీయ స్థాయి క్విజ్ పోటీలో ప్రతిభ చాటారు. ఈ నెల 20న సూరత్‌లో నిర్వహించిన డెర్మటాలజీ క్విజ్‌లో వీరిద్దరూ ద్వితీయస్థానం సాధించారు. క్విజ్‌కి సంబంధించిన ప్రిలిమినరీ పరీక్షలు ఆగస్టు నెలలో ఆన్‌లైన్‌లో నిర్వహించగా, దేశవ్యాప్తంగా 100కి పైగా బృందాలు పాల్గొన్నాయి. అందులో ఫైనల్‌కు చేరిన జిల్లా మెడికల్ కాలేజీ విద్యార్థులు మెరుగైన ప్రదర్శన కనబర్చారు. ఈ సందర్భంగా సూర్య, శశాంత్‌లను జీజీహెచ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ ప్రత్యేకంగా అభినందించారు.

పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా రంగు సోమలింగాగౌడ్



రంగు సోమలింగా గౌడ్‌ను అభినందిస్తున్న అడిషనల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి రమాదేవి, సీనియర్ న్యాయవాదులు

నిజామాబాద్ లీగల్ : నిజామాబాద్ అడిషనల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా రంగు సోమలింగా గౌడ్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఆయన మూడేళ్లపాటు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా సేవలందించనున్నారు. 2010 నుంచి 2020 వరకు జుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో లీగల్ ఎయిడ్ కౌన్సిల్‌గా సేవలందించారు. ప్రస్తుతం జిల్లా న్యాయ సేవా సంస్థలో మీడియేటర్‌గా కొనసాగుతున్నారు. పీపీగా నియామకమైన ఆర్‌ఎస్‌ఎల్ గౌడ్‌ను అడిషనల్ అసిస్టెంట్ సెషన్స్ కోర్టు జడ్జి సాయి రమాదేవి, సీనియర్ న్యాయవాదులు వెంకటేశ్వర్లు, ఆకుల రమేశ్, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు రాజేశ్వర్, సుదర్శన్ తదితరులు అభినందించారు.

ఈ గ్రామాల్లో దసరాకు జెండా ఎగురవేస్తారు

మీకు తెలుసా..



రెడ్డిపేటలో గత దసరాకు ఎగురవేసిన జెండా..



ఇసన్నపల్లి హనుమాన్ మందిరం ముందు..

రామారెడ్డి: దసరా పండుగ అనగానే సెలవులకు స్వగ్రామాలకు వచ్చిన కుటుంబసభ్యులు, అతిథులతో గ్రామాలలో చుక్కా.. ముక్కతో ఎంజాయ్ చేస్తుంటారు. కానీ, ఈ గ్రామాలలో మాత్రం జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తిని చాటుకుంటున్నారు.

- రామారెడ్డి మండలం ఇసన్నపల్లి గ్రామంలోని హనుమాన్ మందిరం ఎదుట దసరా నాడు జెండాను ఎగరవేసి జాతీయగీతాన్ని ఆలపిస్తారు. ఇదే గ్రామంలోని ఇసన్నపల్లి కమేర్ దగ్గర మరో జెండాను ఎగరవేస్తారు.
- రెడ్డిపేట గ్రామంలోనూ భారీ కట్టెతో తయారు చేసిన జెండాను ఎగురవేసి జాతీయగీతాన్ని ఆలపిస్తారు.
- ఈ ఆచారం ఏళ్ల నుంచి ఆనవాయితీగా వస్తుందని గ్రామస్తులు చెప్తున్నారు.
- రెడ్డిపేట గ్రామంలో స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత జాతీయ జెండాను కొన్నేళ్లపాటు ఎగురవేశారు.
- నక్సల్స్ ప్రభావిత గ్రామం కావడంతో జాతీయ జెండాకు బదులుగా తెల్లటి రంగు కలిగిన జెండాను ఎగురవేసినట్లుగా పూర్వీకులు చెప్తున్నారు.
- నిజాం పాలనలో ఉన్నప్పుడు వారు సూచించిన రంగు జెండానే ఎగురవేసేవారట.
- ప్రస్తుతం జిల్లాలోని పలు గ్రామాలలో దసరా రోజున సాయంత్రం జెండాను ఎగరవేస్తున్నారు. అనంతరం చావిడి వద్ద పూజలు చేసి జంబిని ఒకరికొకరు ఇచ్చుకుంటూ పండుగ శుభాకాంక్షలు చెబుతుంటారు.

జీఎస్టీతో దేశప్రజలపై లక్షల కోట్ల భారం వేసిన మోదీ

- ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి



వేల్పూర్: కొత్తగా జీఎస్టీ అమలులోకి తెచ్చి దేశ ప్రజలపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ లక్షల కోట్ల భారం వేశారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి బుధవారం మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో ఆరోపించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం జీఎస్టీ పేరుతో దేశ ప్రజల నుంచి అక్రమంగా దోచిన రూ. 22 లక్షల కోట్ల నుంచి కేవలం రూ. 2 లక్షల కోట్లు తగ్గించి, ప్రజలకు ఏదో చేశామని బీజేపీ నాయకులు జబ్బలు చరుచుకుకుంటూ ఫోజులు కొడుతున్నారని ఎద్దేవా చేశారు. తెలంగాణాలోని ప్రతి వ్యక్తికి నెలకు రూ. 5 వేలు మిగిల్చామని ఎంపీ అర్వింద్ అంటున్నారని, గత తొమ్మిదేళ్లలో తెలంగాణాలోని ప్రతి వ్యక్తి నుంచి రూ. 5,40,000 కేంద్రం దోచుకున్నట్లు ఒప్పుకున్నట్లే కదా అని పేర్కొన్నారు. ఎంపీలు ఏం మొహం పెట్టుకొని మాట్లాడుతున్నారని, జీఎస్టీ పెట్టుమని అడిగింది ఎవరని ప్రశ్నించారు. 2017 నుంచి కొత్తగా జీఎస్టీ తెచ్చి నిత్యావసర సరుకులు, అన్ని రకాల వాహనాలు, ఇతర వస్తువులపై ధరలు పెంచింది మీరు కాదా? అని అన్నారు. జీఎస్టీ పేరుతో మోసం చేస్తున్నదెవరో ప్రజలు గమనిస్తున్నారని, సమయం వచ్చినప్పుడు ఓట్ల కోతలు పెట్టడం ఖాయమన్నారు.

మోతాదుకు మించి యూరియా వాడొద్దు

జిల్లా వ్యవసాయాధికారి గోవింద్



వేల్పూర్‌లో ఎరువుల గోదాంను పరిశీలిస్తున్న డీఏవో గోవింద్

వేల్పూర్: మోతాదుకు మించి యూరియా వాడటంతో పంటలకు తెగుళ్ల వస్తాయని, వాతావరణం సైతం కలుషితమవుతుందని జిల్లా వ్యవసాయాధికారి గోవింద్ పేర్కొన్నారు. బుధవారం ఆయన వేల్పూర్, అంక్సాపూర్ గ్రామాలలోని ఎరువుల గిడ్డంగులను తనిఖీ చేశారు. స్టాకును పరిశీలించి మాట్లాడారు. 2025–26 ఏడాదిలో ఇప్పటి వరకు జిల్లాలో 2985.03 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా జరిగిందన్నారు. అవసరానికి మించి కొనే యూరియాతో కృత్రిమ కొరత ఏర్పడుతుందని, అంతేగాక రైతులపై పెట్టుబడి భారం పెరుగుతుందన్నారు. సంప్రదాయ యూరియాకు బదులుగా నానో యూరియా వాడాలని, ఇది ఆకులపై ద్రవరూపంలో పిచికారీ చేయడంతో మొక్కలలో పోషణ ఎక్కువగా జరిగి, దిగుబడి 8 శాతం వరకు పెరుగుతుందని చెప్పారు. ఆయన వెంట వ్యవసాయాధికారి శృతి, సొసైటీ కార్యదర్శి కృష్ణ, సతీశ్, సుభాష్ ఉన్నారు.

డిపాజిట్ల పేరిట రూ. 8.5 కోట్ల టోకరా

- యూఎస్ డాలర్, క్రిప్టో కరెన్సీ, ట్రేడింగ్ అంటూ ఆన్‌లైన్ దందా
- ఇద్దరు నిందితుల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీసీఎస్ ఏసీపీ నాగేంద్రచారి

ఖలీల్‌వాడి: అనుమతి లేకుండా కంపెనీలు పెట్టి 125 మంది నుంచి డిపాజిట్ల పేరిట డబ్బులు వసూలు చేసిన ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు క్రైం బ్రాంచ్ ఏసీపీ నాగేంద్ర చారి తెలిపారు. జిల్లా కేంద్రంలోని సీసీఎస్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. నగరంలోని హాస్మీ కాలనీకి చెందిన మొయిజ్ ఖాన్, మహమ్మదీయ కాలనీకి చెందిన సయ్యద్ మహ్మద్ హాసన్ ఇద్దరు స్నేహితులు. 2022–23లో షైన్ ఎవర్ గ్రీన్ కంపెనీ పేరిట సంస్థను ఏర్పాటు చేశారు. తమ కంపెనీలో డిపాజిట్ పెడితే రూ. లక్షకు 10 శాతం వరకు అందిస్తామని నమ్మబలికారు. కొంతమంది మిత్రులు, ఏజెంట్లను ఏర్పాటు చేసుకొని 125 మంది నుంచి రూ.8.5 కోట్ల డిపాజిట్లు సేకరించారు. ఆ తర్వాత మొయిజ్‌ఖాన్, సయ్యద్ మహ్మద్ హాసన్‌లు డిపాజిటర్లకు డబ్బులు చెల్లించడంలో జాప్యం చేస్తూ వచ్చారు. డిపాజిటర్లు ఒత్తిడి చేయడంతో మకాం మార్చారు. దీంతో ఇందల్వాయి మండలంలోని లోలం గ్రామానికి చెందిన హకీం ఫిర్యాదు చేయడంతో సీపీ పోతరాజు సాయిచైతన్య కేసును సీసీఎస్‌కు బదిలీ చేశారు. కేసు దర్యాప్తు అనంతరం మొయిజ్‌ఖాన్, సయ్యద్ మహ్మద్ హాసన్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఏసీపీ వెల్లడించారు.

మకాం మార్చిన నిందితులు

మొయిజ్‌ఖాన్, సయ్యద్ మహ్మద్ హాసన్‌లు నిజామాబాద్ నుంచి మకాం మార్చి మహారాష్ట్రకు వెళ్లారు. అక్కడి నుంచి ఆన్‌లైన్‌లో క్రిప్టో, యూఎస్ డాలర్, ట్రేడింగ్ పేరిట యాప్ ద్వారా వసూళ్లకు తెర లేపారు. ఉత్తరప్రదేశ్, ఢిల్లీ ప్రాంతాల్లో ఏజెంట్లను ఏర్పాటు చేసుకొని మీటింగ్‌లు ఏర్పాటు చేశారు. కాగా, వీరి వలలోపడి ఎంతమంది ప్రజలు మోసపోయారో తెలియాల్సి ఉందని ఏసీపీ నాగేంద్రచారి తెలిపారు. మరోవైపు హైదరాబాద్‌లో ఓ భూమిని నిందితులిద్దరూ కలిసి కొనుగోలు చేసి రూ. 25 లక్షలు అడ్వాన్స్‌గా ఇచ్చినట్లు తెలిపారు. ఈ సమావేశంలో సీసీఎస్ సీఐలు రవీందర్, సురేశ్, కానిస్టేబుళ్లు ఉన్నారు.

క్రైం కార్నర్

మరిది చితి మంటలు ఆరకముందే వదిన మృతి

- చుక్కాపూర్‌లో విషాదం



కమల (ఫైల్)

మాచారెడ్డి: గల్ఫ్‌లో గుండెపోటుతో మరణించిన మరిది మృతదేహానికి అంత్యక్రియలు పూర్తయిన గంటల్లోనే వదిన మృతి చెందిన ఘటన మాచారెడ్డి మండలం చుక్కాపూర్‌లో బుధవారం చోటు చేసుకుంది. చుక్కాపూర్‌కు చెందిన ఎల్లయ్య బతుకుదెరువు కోసం బహ్రెయిన్ వెళ్లిన మూడు నెలలకే గుండెపోటుతో మృతి చెందాడు. ఆయన మృతదేహం మంగళవారం ఇంటికి చేరుకోగా, కుటుంబీకులు అంత్యక్రియలు నిర్వహించారు. చితి మంటలు ఆరకముందే అన్న భిక్షపతి భార్య కమల(46) అనారోగ్యంతో బుధవారం మరణించింది. ఎల్లయ్య కర్మకాండలు చేయకముందే కమల చనిపోవడంతో కుటుంబసభ్యులు బోరున విలపించారు. కమలకు కూతురు, ఇద్దరు కుమారులు ఉన్నారు.

విద్యుదాఘాతంతో ఒకరు ..



రాజు (ఫైల్)

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డిలో విద్యుదాఘాతంతో బుధవారం ఒకరు మృతి చెందారు. గ్రామానికి చెందిన శేకెల్లి రాజు(40) ఉదయం తన పొలంలోని బోర్ మోటార్ సమీపంలో గడ్డి కట్ చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ తీగ తెగిపడి కటింగ్ యంత్రానికి తగిలింది. దీంతో విద్యుత్‌షాక్‌కు గురైన రాజు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పుష్పరాజ్ తెలిపారు.


మద్యానికి బానిసై ఒకరు..



రామ్మోహన్‌రెడ్డి (ఫైల్)

నిజామాబాద్ రూరల్: మోపాల్ మండలంలోని కంజర్ గ్రామానికి చెందిన అంగలి రామ్మోహన్ రెడ్డి(45) మద్యానికి బానిసై మృతి చెందినట్లు కుటుంబసభ్యులు బుధవారం తెలిపారు. రామ్మోహన్‌రెడ్డి మద్యానికి బానిసకావడంతో కుటుంబసభ్యుల సూచన మేరకు రెండు నెలలుగా మద్యం మానేశాడు. ఈ నెల 22న ఇంటి పక్కన గుర్తు తెలియని పురుగుల మందు తాగుతుండగా గమనించిన కుమార్తె అతని చేతిలోని సీసాను లాగేసింది. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడి భార్య సరిత ఫిర్యాదు మేరకు ఎస్సై సుశ్మిత కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తిరుపతిలో కామారెడ్డి జిల్లా వాసి హత్య!



సతీశ్ (ఫైల్)

తిరుపతి అర్బన్/రాజంపేట: తిరుపతిలో కామారెడ్డి జిల్లా రాజంపేట మండలం ఆర్గొండ గ్రామానికి చెందిన తిమ్మన్నగారి సతీశ్‌కుమార్ (32) హత్యకు గురయ్యాడు. బస్టాండ్‌కు ఎదురుగా రైల్వే ట్రాక్‌పై సతీశ్ మృతదేహాన్ని రైల్వే పోలీసులు బుధవారం గుర్తించారు. సతీశ్ కుమార్ ఓ ప్రైవేటు పాఠశాలలో పీఈటీగా పనిచేసేవాడు. గతేడాది ఆగస్టులో వివాహం జరిగింది. ఈ నెల 22న తిరుపతికి వెళ్లిన సతీశ్ హత్యకు గురయ్యాడు. మృతదేహంపై గాజు బాటిళ్లతో కొట్టిన గాయాలు ఉన్నాయని, హత్యగా భావిస్తున్నామని పోలీసులు తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ



బీరువాను పరిశీలిస్తున్న ఎస్సై మహేశ్

వర్ని: మండలంలోని మల్లారం గ్రామంలో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగినట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. గ్రామానికి చెందిన జంపాల అనిల్‌కుమార్, ఆయన భార్య పని నిమిత్తం బుధవారం ఉదయం వర్నికి వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి 6 తులాల బంగారు ఆభరణాలు, 10 తులాల వెండి, రూ.49,500 నగదు అపహరించారు. బుధవారం సాయంత్రం అనిల్‌కుమార్ ఇంటికి వచ్చి చూడగా చోరీ జరిగిన విషయాన్ని గమనించి, పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకొని, క్లూస్‌టీం ద్వారా ఆధారాలు సేకరించినట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. అనిల్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

బైక్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు.. ఒకరు మృతి



రాజమల్లు (ఫైల్)

ధర్పల్లి: మండలంలోని నడిమితండా పంచాయతీ పరిధిలోని కర్నల్ తండా వద్ద బుధవారం ఆర్టీసీ బస్సు, బైక్‌పైకి దూసుకెళ్లడంతో ఒకరు అక్కడికక్కడే మృతి చెందారు. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం.. హొన్నాజీపేట్ గ్రామానికి చెందిన మిద్దెల రాజమల్లు (42) లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. బుధవారం తన కూతురిని కామారెడ్డి జిల్లా పోసానిపేటలోని అత్తవారింట్లో దింపి బైక్‌పై హొన్నాజీపేట్‌కు తిరుగుప్రయాణం అయ్యాడు. మార్గమధ్యలో కర్నల్ తండా వద్ద బైక్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. దీంతో రాజమల్లు అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించేందుకు ప్రయత్నించగా మృతుడి కుటుంబసభ్యులు, గ్రామస్తులు రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంతోనే ప్రమాదం జరిగిందని ఆరోపించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

వర్ని: మండలంలోని శ్రీనగర్ వాగు వద్ద బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. శ్రీనగర్ గ్రామానికి చెందిన వాగ్మోరే సుభాష్, సిందిగిడి ఉమాకాంత్ బైక్‌పై వర్ని నుంచి శ్రీనగర్ వెళ్తుండగా, నిజామాబాద్ నుంచి వస్తున్న కారు ఢీకొన్నాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. వర్ని పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

శిథిలావస్థలో పశు వైద్యశాలలు

- వేధిస్తున్న వైద్యులు, సిబ్బంది కొరత
- పట్టించుకోని అధికార యంత్రాంగం


దోమకొండలో శిథిలావస్థకు చేరిన పశువైద్యశాల

దోమకొండ: జిల్లాలో పశు వైద్యశాలలు చాలా చోట్ల శిథిలావస్థలకు చేరుకున్నాయి. ఏ క్షణాన కూలుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. వర్షా కాలం కావడంతో అందులో పనిచేస్తున్న సిబ్బంది భయంభయంగా విధులు నిర్వహిస్తున్నారు. శిథిలావస్థకు చేరుకున్న భవనాల్లో సరైన వసతులు లేని కారణంగా పశువులకు వైద్య సేవలు కూడా పూర్తి స్థాయిలో అందడం లేదు. జిల్లాలో దోమకొండతో పాటు, కామారెడ్డి, బాన్సువాడ, ఎల్లారెడ్డి, బిచ్కుంద, మద్నూర్ ప్రాంతాల్లో వెటర్నరీ ఏడీ కార్యాలయాలున్నాయి. అన్నీ శిథిలావస్థకు చేరాయి.

జిల్లాలో 30 మండల స్థాయి పశువైద్యశాలలు, మరో 16 గ్రామాల్లో సబ్ సెంటర్లు ఉన్నాయి. వీటిలో సగానికి పైగా శిథిలావస్థకు చేరాయి. దీంతో అక్కడ పనిచేస్తున్న వెటర్నరీ వైద్యులు సిబ్బంది భయం భయంగా విధులు నిర్వహిస్తున్నారు. దీనికి తోడు చాలా పశువైద్యశాలల్లో డాక్టర్లు , సిబ్బంది కొరత ఉంది. జిల్లాలో పశువులు మూడు లక్షలు, గొర్రెలు, మేకలు దాదాపు ఆరు లక్షల వరకు ఉన్నాయి. పశువులు, గొర్రెలు రోగాల బారిన పడకుండా ప్రతిఏటా గ్రామీణ ప్రాంతాల్లో ప్రత్యేకంగా క్యాంపులు ఏర్పాటు చేసి మందులు అందజేసేందుకు వీలుగా ప్రభుత్వం అవసరమైన నిధులు కేటాయిస్తుంది. సిబ్బంది కొరత కారణంగా ప్రస్తుతం వాటిని పూర్తి స్థాయిలో వినియోగించే పరిస్థితి లేకుండా పోయింది. సమస్యను పరిష్కరించాలని సిబ్బంది, రైతులు కోరుతున్నారు.

ఎప్పుడు కూలుతుందో తెలియదు



దోమకొండలోని పశువైద్యశాల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఈ విషయంలో గతంలో మండలానికి సంబంధించిన జెడ్పీటీసీ, ఇతర ప్రజాప్రతినిధులకు వివరించాం. శిథిలావస్థలో ఉన్న భవనాన్ని కూల్చివేసి నూతన భవనం నిర్మిస్తే బాగుంటుంది. వర్షాకాలం కావడంతో మరింతగా ఇబ్బందిగా ఉంది. మూగ జీవాలకు సేవలందించడానికి కష్టంగా మారింది.

– శ్రీనివాస్, వెటర్నరీ ఏడీ, దోమకొండ

వంతెన నిర్మాణం కలేనా..


మనోహరాబాద్ శివారులో ప్రవహిస్తున్న రొడ్డం వాగు


రొడ్డం వాగు పైభాగంలో ధ్వంసమైన కాజ్‌వే


మనోహరాబాద్ -కలిగోట్ మధ్య బైపాస్ రోడ్డు

- ఉధృతంగా పారుతున్న రొడ్డంవాగు
- మనోహరాబాద్– కలిగోట్ గ్రామాల మధ్య రాకపోకలకు అంతరాయం
- ఇబ్బందుల్లో వాహనదారులు

జక్రాన్‌పల్లి: జక్రాన్‌పల్లి మండలంలోని మనోహరాబాద్– కలిగోట్ గ్రామాల మధ్య వంతెన నిర్మాణం కలగా మారింది. ఇరు గ్రామాల మధ్య రొడ్డంవాగు ఉంది. ఈ వాగు వర్షకాలంలో వరద నీటితో ఉధృతంగా ప్రవహిస్తుంది. ప్రతిఏటా వర్ష కాలంలో రెండు గ్రామాల మధ్య రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. వాగు దాటి వ్యవసాయ పొలాలకు వెళ్లాలన్నా రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. వాగు పారితే చాలు అటువైపు పంటపొలాలు ఉన్న రైతులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. రైతులు అటువైపు వేరే రోడ్డు గుండా వెళ్లాలంటే రెండు కిలోమీటర్లు దూరం వెళ్లి తిరిగి రావాల్సి ఉంటుంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు రైతులను అతలాకుతలం చేస్తున్నాయి. వాగు చుట్టు పక్కల రైతులు మొక్కజొన్న, వరి పంటలను సాగు చేశారు. వివిధ పంటలకు ఎరువులు చల్లాలన్నా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఎరువుల బస్తాలను తీసుకువెళ్లడానికి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అదేవిధంగా రొడ్డం వాగు పైభాగంలో రైతుల పంట పొలాలకు వెళ్లే కాజ్‌వే ధ్వంసమైంది. దీంతో అటువైపు వెళ్లి వ్యవసాయ పనులు చేయడానికి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కేవలం రైతులకే కాక కలిగోట్, చింతలూర్ గ్రామాల వాహనదారులకు సైతం ఇబ్బందులు తప్పడం లేదు . ఈ రెండు గ్రామాల ప్రజలు ప్రతి నిత్యం ఆర్మూర్ పట్టణ ప్రాంతానికి ఈ బై పాస్ రోడ్డు వెంట వెళుతుంటారు. దీంతో వాహనదారులు అదనంగా రెండు కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోంది. ఇరు గ్రామాల మధ్య వంతెన నిర్మాణం చేపట్టాలని గతంలో ప్రజాప్రతినిధులకు విన్నవించిన స్పందన కరువైందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ చూపి వంతెన నిర్మాణం చేపట్టాలని ఇరు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వంతెన లేక ఇబ్బందులు పడుతున్నాం..



రొడ్డం వాగుపై వంతెన లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడు తున్నాం. అటు వైపు వ్యవసాయ పంట పొలాలకు వెళ్లలేకపోతున్నాం. ప్రస్తుతం రొడ్డం వాగులో వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో వాగు దాటడానికి కష్టంగా మారింది. వాగుపై వంతెన నిర్మించి రైతుల కష్టాలు తొలగించాలి. –గడ్డం గంగారెడ్డి రైతు, మనోహరాబాద్

రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది



మనోహరాబాద్,కలిగోట్ గ్రామాల మధ్య రొడ్డం వాగు పై వరద నీరు ఉధృతంగా పారుతోంది. దీంతో ఇరు గ్రామాల మధ్య రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. వంతెన లేక అనేక అవస్థలు పడుతున్నాం. ప్రజల కష్టాలను తొలగేలా అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలి.

–మాదరి నెహ్రూ, రైతు, మనోహరాబాద్

మూలమలుపుల వద్ద ఫ్లెక్సీలు..


గాయత్రినగర్‌లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

నిజామాబాద్ సిటీ : మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఫ్లెక్సీల సంస్కృతి విచ్చలవిడిగా పెరిగిపోయింది. ఎవరికి తోచిన విధంగా వారు, ఎక్కడ పడితే అక్కడ ఫ్లెక్సీలు పెడుతున్నారు. రోడ్డుకు అడ్డంగా, మూలమలుపుల వద్ద ఏర్పాటు చేస్తున్న ఫ్లెక్సీలతో వాహనదారుల ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇటీవల అమ్మవారిపేరుతో ఓ వస్త్రవ్యాపారి తన వ్యాపార ప్రచారంలో భాగంగా నగరంలోని పలు కాలనీల్లో విచ్చలవిడిగా ఫ్లెక్సీలు పెట్టారు. గాయత్రినగర్‌లో మూలమలుపు వద్ద పెట్టిన ఫ్లెక్సీతో రెండు రోజుల వ్యవధిలో పలువురు వాహనదారులు ఢీకొని గాయాలపాలయ్యారు.

రెవెన్యూ అసోసియేషన్ నూతన కార్యవర్గం


ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

నిజామాబాద్ అర్బన్: జిల్లా రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. ఎన్నికల్లో బోధన్, ఆర్మూర్ డివిజన్‌లకు చెందిన యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు, కార్యవర్గసభ్యులు, రెవెన్యూ ఉద్యోగులు, తహసీల్దార్లు పాల్గొన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా రమణ్‌కుమార్, అసోసియేట్ అధ్యక్షుడిగా పుల్లయ్య గారి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా ప్రభు, సాయి భూషణ్, శైలజ, ప్రధాన కార్యదర్శిగా ప్రశాంత్‌కుమార్, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా వసంతరావు భరద్వాజ్, సహాయ కార్యదర్శులుగా రాజేశ్వర్, సవిత, రాము, శ్రావణ్‌కుమార్, గంగరాజు, కోశాధికారిగా విజయ్‌కాంత్ రావు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా నారాయణరెడ్డి, నిరంజన్ రావు వ్యవహరించారు. అనంతరం నూతన కార్యవర్గసభ్యులు ప్రమాణస్వీకారం చేశారు.

పౌష్టికాహారం తీసుకోవాలి


మాట్లాడుతున్న సీడీపీవో జ్యోతి

ఇందల్వాయి: ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తీసుకోవాలి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి అన్నారు. పోషణ్ మాసం కార్యక్రమంలో భాగంగా ఇందల్వాయి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గన్నారం గ్రామంలో మహిళలకు అవగాహన కల్పించారు. పోషకాలు సమృద్ధిగా ఉన్న ఆహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఈవో శంకర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శోభ, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

బాక్సింగ్ కోచ్ ఎత్తేసాముద్దీన్‌కు సన్మానం


ఎత్తేసాముద్దీన్‌ను సన్మానిస్తున్న క్రీడాసంఘాల ప్రతినిధులు

నిజామాబాద్ నాగారం: అంతర్జాతీయ స్థాయిలో కోచ్‌గా వ్యవహరించిన బాక్సింగ్ కోచ్ ఎత్తేస్తాముద్దీన్ జిల్లాకు రావడంతో క్రీడాసంఘాల ప్రతినిధులు బుధవారం రాత్రి కలెక్టరేట్ మైదానంలో సన్మానించారు. భారత మహిళల జట్టుకు కోచ్‌గా వ్యవహరించి దేశానికి పతకాలు రావడంలో కృషి చేశారు. భారత మహిళా జట్టుకు బాక్సింగ్ కోచ్‌గా వ్యవహరిస్తూనే.. ఆర్మీలో సేవలందిస్తున్నారు. కార్యక్రమంలో అథ్లెటిక్స్ జాతీయ బంగారు పతక విజేత, సయ్యద్ కైసర్, జిల్లా బాక్సింగ్ కోచ్ షంసాముద్దీన్, డీవైఎస్‌వో పవన్, ఒలింపిక్ సంఘం మాజీ జిల్లా కార్యదర్శి బొబ్బిలి నర్సయ్య, నరేందర్‌సింగ్, యాసిన్, యాకూబ్ తదితరులున్నారు.

మెరుగైన వైద్యసేవలందించాలి



నిజామాబాద్ నాగారం: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో నర్సింగ్ ఆఫీసర్, ఫార్మసీ ఆఫీసర్, ఏఎస్‌ఎం పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు కలెక్టర్ ఆదేశాల మేరకు డీఎంహెచ్‌వో రాజశ్రీ బుధవారం నియామకపత్రాలు అందజేశారు. నియామకపత్రాలు అందుకున్న వారిలో స్టాఫ్ నర్సులు/నర్సింగ్ ఆఫీసర్లు 30 మంది, ఆరోగ్య కార్యకర్తలు/ఏఎస్‌ఎంలు ముగ్గురు, ఫార్మసీ ఆఫీసర్లు తొమ్మిది మంది ఉన్నారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. ఓర్పు, క్రమశిక్షణతో, అంకిత భావంతో ప్రభుత్వ ఉద్యోగంలో విధులు నిర్వర్తిస్తూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలన్నారు. కార్యక్రమంలో ఏవో రాజేశ్వర్, సూపరింటెండెంట్ పద్మ, రామకృష్ణ, శ్రీకాంత్, జస్టిన్, చందన, సుజన, గంగామణి, లత, సంధ్య, ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కుళ్లిన కోడిగుడ్లేనా..!


ఇటీవల రాపనపల్లిలో సరఫరా అయిన గుడ్లు


చిన్న పరిమాణంలో కోడిగుడ్లు

- అంగన్‌వాడీ కేంద్రాలకు నాసిరకం సరఫరా
- ఆందోళనలో తల్లిదండ్రులు
- పోషణ మాసోత్సవం సమయంలోనే నాణ్యతలేనివి పంపిణీ

వివరాలు
అంగన్‌వాడీ కేంద్రాలు : 969
గర్భిణులు : 4,245
బాలింతలు : 3,186
చిన్నారులు : 39,229

మంచిర్యాలటౌన్: మంచిర్యాల జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందకుండా పోతోంది. ఓ వైపు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ నెల 17 నుంచి అక్టోబర్ 16వరకు పోషణ మాసోత్సవాన్ని జిల్లా శిశు, మహిళా, దివ్యాంగులు, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తుండగా.. మరోవైపు కుళ్లిన కోడిగుడ్లను సరఫరా చేయడంపై ఆందోళన వ్యక్తమవుతోంది. నాణ్యతతో కూడిన పౌష్టికాహారాన్ని తీసుకోవాలని ప్రజలకు వివరిస్తూనే నాసిరకం కోడిగుడ్లు అందిస్తున్నారు. ఇటీవల జిల్లాలోని కోటపల్లి మండలం రాపనపల్లి గ్రామంలో లబ్ధిదారులకు కుళ్లిన కోడిగుడ్లు అందజేశారు. అంగన్‌వాడీ టీచర్లు వారికి వచ్చిన ఓటీపీని చెప్పి కోడిగుడ్ల నాణ్యతను పరిశీలించి తీసుకోవాల్సి ఉంటుంది. కానీ చిన్న పరిమాణంలో ఉన్నా, నాణ్యత లేకున్నా తీసుకుని లబ్ధిదారులకు అందిస్తుండడం, అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తుండడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మూడేళ్ల వయస్సు పైబడిన చిన్నారులు, గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చి పప్పు, ఆకుకూరలు, కోడిగుడ్డుతో కూడిన పౌష్టికాహార భోజనాన్ని మధ్యాహ్నం తింటున్నారు. మూడేళ్లలోపు చిన్నారులకు నెలకు 16 కోడిగుడ్లు, బాలామృతం ఇంటికే ఇస్తున్నారు. కోడిగుడ్లు ఇంటికి తీసుకెళ్లిన తర్వాత ఉడకబెట్టగా దుర్వాసన వస్తున్నాయని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నాణ్యత లేని గుడ్లు తినడం వల్ల చిన్నారులు రోగాల బారిన పడే ప్రమాదం ఉందని వాపోతున్నారు. కాంట్రాక్టర్ నాసిరకమైన, చిన్న పరిమాణంలో ఉన్న గుడ్లు సరఫరా చేస్తున్నా పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి.

కాంట్రాక్టర్ మార్పుతోనైనా మారేనా..!

ప్రస్తుతం కోడిగుడ్లను అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేస్తున్న కాంట్రాక్టర్ల స్థానంలో ఇటీవల ప్రభుత్వం టెండర్లు నిర్వహించి కొత్తవారికి కేటాయించింది. అంగన్‌వాడీ కేంద్రాలకే కాకుండా, జిల్లావ్యాప్తంగా ఉన్న అన్ని గురుకులాలు, హాస్టళ్లు, ప్రభుత్వ పాఠశాలలకు కోడిగుడ్లు సరఫరా చేసేందుకు అప్పగించగా, మరికొద్ది రోజుల్లోనే నూతన కాంట్రాక్టర్ నుంచి సరఫరా జరగనుంది. ప్రస్తుత కాంట్రాక్టర్ నాసిరకం కోడిగుడ్లు సరఫరా చేయకుండా నియంత్రించి, కొత్త కాంట్రాక్టర్ నాణ్యతతో కూడినవి సరఫరా చేసేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. నిబంధనల మేరకు ఉన్న కోడిగుడ్లనే టీచర్లు తీసుకోవాల్సి ఉండగా, జిల్లా అధికారుల పర్యవేక్షణ తప్పనిసరిగా ఉంటేనే సాధ్యమవుతుంది.

వివరాలు

అంగన్‌వాడీ కేంద్రాలు	969
గర్భిణులు	4,245
బాలింతలు	3,186
చిన్నారులు	39,229

నాణ్యతతో ఉన్నవాటినే తీసుకుంటున్నాం



జిల్లాలోని ప్రతీ అంగన్‌వాడీ కేంద్రానికి సరఫరా చేసే కోడిగుడ్లు పూర్తి నాణ్యతతో ఉంటేనే తీసుకోవాలని టీచర్లకు చెబుతున్నాం. అందుకు తగినట్లుగానే సీడీపీవోలు, సూపర్‌వైజర్లు తనిఖీలు చేపడుతున్నారు. లబ్ధిదారులు కోడిగుడ్లను ఇంటికి తీసుకెళ్లిన ఎక్కువ రోజుల తర్వాత వాటిని ఉడికించడం వల్ల పాడైనట్లుగా గుర్తించారు. కోడిగుడ్లు చిన్న పరిమాణంలో ఉంటే వెనక్కి పంపించాలని, పాడైనవి ఉన్నా తీసుకోవద్దని ఆదేశించాం.

– రౌఫ్‌ఖాన్, జిల్లా సంక్షేమశాఖ అధికారి, మంచిర్యాల

మంచిర్యాలలో చెడ్డీ గ్యాంగ్ స్వైర విహారం

- ఒకే రోజు మూడిళ్లలో చోరీ
- పోలీసులను చూసి పారిపోయిన ముఠా


అనుమానితులను విచారిస్తున్న పోలీసులు

మంచిర్యాలక్రైం/నస్పూర్: మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఆరుగురుతో కూడిన చెడ్డీ గ్యాంగు ముఠా మంగళవారం అర్ధరాత్రి స్వైరవిహారం చేసింది. సీసీసీ పోలీసుస్టేషన్ పరిధిలోని విలేజ్ నస్పూర్‌లో ఓ ఇంట్లో చోరీ చేసి అక్కడి నుంచి మంచిర్యాలలోని సాయికుంట, గోదావరివాడలో రెండిళ్లలో చోరీకి పాల్పడ్డారు. మరో ఇంట్లో చోరీకి యత్నించే క్రమంలో పోలీసులు వారి వ్యూహాన్ని తిప్పికొడుతూ పట్టుకునే ప్రయత్నం చేయగా పారిపోయారు. ఈ ఘటన జిల్లా కేంద్రంలో కలకలం రేపింది. వివరాలిలా ఉన్నాయి. స్థానిక సాయికుంట వైపు నుంచి విలేజ్ నస్పూర్‌లో ప్రవేశించిన ముఠా నస్పూర్‌లోని వినూత్న కాలనీకి చెందిన మోండె దేవక్క ఇంట్లో దొంగతనానికి పాల్పడ్డారు. అక్కడి నుంచి సాయికుంట, గోదావరివాడ ప్రాంతంలో రెండిళ్లలో రెండు సెల్‌ఫోన్లు ఎత్తుకెళ్లినట్లు తెలిసింది. స్థానికులు గమనించి 100 డయల్‌కు సమాచారం అందించారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు డీసీపీ భాస్కర్, ఏసీపీ ప్రకాష్, సీఐలు ప్రమోద్‌రావు, మంచిర్యాల రూరల్ సీఐ ఆకుల అశోక్ మూడు బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టారు. గోదావరివాడలో మరో ఇంట్లో దొంగతనానికి యత్నించగా.. అప్పటికే గాలిస్తున్న పోలీసులను చూసి పారిపోవడం గమనార్హం. పోలీసులు గాలిస్తుండగా కొందరు వ్యక్తులు చెడ్డీలు వేసుకుని తారసపడగా అనుమానితులను విచారించి వదిలేసినట్లు తెలిసింది. పోలీసులు వెంటనే అప్రమత్తం కావడంతో మరిన్ని ఇళ్లలో దొంగతనాలను నివారించగలిగారు. రాత్రి, పగలు అనుమానితులు కాలనీల్లో కనిపిస్తే వెంటనే 100 డయల్‌కు సమాచారం అందించాలని డీసీపీ భాస్కర్ తెలిపారు.

కోలిండియా పోటీలకు బాడీ బిల్డర్ల ఎంపిక



కోలిండియా పోటీలకు ఎంపికైన మొగిలి, అర్జున్

బెల్లంపల్లి: మంచిర్యాల జిల్లా బెల్లంపల్లికి చెందిన ఇద్దరు బాడీ బిల్డర్లు కోలిండియా బాడీబిల్డింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికయ్యారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని సీఈఆర్ క్లబ్‌లో మంగళవారం రాత్రి సింగరేణి కంపెనీ స్థాయి బాడీ బిల్డింగ్ పోటీలు నిర్వహించారు. సింగరేణి ఉద్యోగులు జనగామ మొగిలి 75కిలోల విభాగంలో, పెసరి అర్జున్ 70కిలోల విభాగంలో పాల్గొని ప్రథమ బహుమతి గెల్చుకున్నారు. కోలిండియా స్థాయి బాడీ బిల్డింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించారు. ఈ పోటీలు వచ్చే అక్టోబర్‌లో మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో జరగనున్నాయి. ఇద్దరు బాడీ బిల్డర్లను స్కైజిమ్ కోచ్ సదానందం, జిమ్ నిర్వాహకులు బాలకృష్ణ, చంద్రశేఖర్, క్రీడాకారులు అభినందించారు.

మందమర్రి క్రీడాకారులు..

మందమర్రిరూరల్: కోలిండియా పోటీలకు మందమర్రి ఏరియా క్రీడాకారులు ఎంపికయ్యారు. మందమర్రి వర్క్‌షాపులో ఈఎఫ్‌ఎం విధులు నిర్వరిస్తున్న బత్తుల వెంకటస్వామి బాడీ బిల్డింగ్(95 కిలోల విభాగం)లో, కాసిపేట-1 గనిలో పంపు ఆపరేటర్ బెల్లం అరుణ్ వెయిట్ లిఫ్టింగ్(79 కిలోల విభాగం)లో బంగారు పతకాలు సాధించారు. వారిని కోలిండియా పోటీలకు ఎంపిక చేశారు. ఏరియా జీఎం రాధాకృష్ణ, ఎస్వో టు జీఎం జయప్రసాద్, శ్యామ్‌సుందర్, శివకృష్ణ అభినందించారు.

‘ఎన్‌కౌంటర్లతో ఉద్యమాన్ని అణచివేయలేరు’


జోహార్లు అర్పిస్తున్న నాయకులు, కుటుంబీకులు

బెల్లంపల్లిరూరల్: మావోయిస్టులపై బూటకపు ఎన్‌కౌంటర్లతో విప్లవ ఉద్యమాన్ని అణచివేయలేరని విప్లవ రచయితల సంఘం(విరసం) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పినాకపాణి, అమరుల బంధుమిత్రుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు పద్మకుమారి, ప్రధాన కార్యదర్శి శాంతక్క, పౌర హక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారాయణరావు అన్నారు. ఛత్తీస్‌గఢ్‌లోని గరియాబంద్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన మావోయిస్టు పార్టీ టెక్నికల్ టీమ్ ఒడిశా రాష్ట్ర కమిటీ సభ్యుడు జాడి వెంకటి అలియాస్ విమల్(56) సంస్మరణ సభ బుధవారం మండలంలోని చంద్రవెల్లి గ్రామంలో నిర్వహించారు. వెంకటి చిత్రపటానికి కుటుంబ సభ్యులు, ఆయా సంఘాల నేతలు పూలమాలలు, కళాకారులు పాటలతో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మావోయిస్టు పార్టీ మాజీ రాష్ట్ర కమిటీ సభ్యుడు మహ్మద్ హుస్సేన్, విరసం నాయకుడు రాజన్న, పౌరహక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కుమారస్వామి, నాయకులు లక్ష్మణ్, సారయ్య, పోషన్న, జైపాల్ సింగ్, సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ రాష్ట్ర కమిటీ సభ్యుడు చాంద్ పాషా, తదితరులు పాల్గొన్నారు.

లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలి

- లేకుంటే స్థానిక సంస్థల ఎన్నికలను బహిష్కరిస్తాం
- తుడుందెబ్బ తెలుగు రాష్ట్రాల ఉమ్మడి అధ్యక్షుడు అరుణ్‌కుమార్
- ఇంద్రవెల్లిలో ఆదివాసీల భారీ ర్యాలీ


భారీ ర్యాలీగా బయలుదేరిన ఆదివాసీలు

ఇంద్రవెల్లి: చట్టబద్ధత లేని లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ తుడుందెబ్బ ఆధ్వర్యంలో ఆదివాసీలు మండలకేంద్రంలో బుధవారం ఆందోళన చేపట్టారు. ముందుగా ఇంద్రవెల్లి, సిరికొండ మండలాలకు చెందిన తొమ్మిది తెగల వారు పాదయాత్రగా స్థానిక అమరవీరుల స్తూపం వరకు చేరుకుని నివాళులర్పించారు. అనంతరం స్థానిక మార్కెట్ యార్డు వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభ ప్రాంగణానికి ర్యాలీగా చేరుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తుడుందెబ్బ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల అధ్యక్షుడు మైపతి అరుణ్‌కుమార్ మాట్లాడారు. ఆదివాసీలు ఈ దేశానికి మూలవాసులన్నారు. 1976 అనంతరం లంబాడాలు అప్పటి ప్రభుత్వాలను మోసం చేసి ఎస్టీ జాబితాలో చేరారని ఆరోపించారు. వారిని వెంటనే ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని, లేని పక్షంలో రాయిసెంటర్ సార్‌మేడీలతో చర్చించి రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను బహిష్కరిస్తామని హెచ్చరించారు. రాష్ట్ర అధ్యక్షుడు కొట్నాక్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ, చట్ట బద్ధతలేని లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించే వరకు శాంతియుత ఆందోళనలను కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో తుడుందెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోడం గణేశ్, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పుర్క బాపూరావ్, జిల్లా అధ్యక్షుడు దాదిరావ్, రాయిసెంటర్ జిల్లా సార్‌మేడి మెస్రం దుర్గు, ఆదివాసీ తొమ్మిది తెగల సంఘాల రాష్ట్ర, జిల్లా నాయకులు ఆర్క ఖమ్ము, పెందోర్ పుష్పరాణి, సోయం భీంరావ్, కోవ దౌలత్‌రావ్, కుడే కైలాస్, విష్ణు, భీంరావ్, రాయిసెంటర్ సార్‌మేడీలు, ఆదివాసీలు పాల్గొన్నారు.

భూములున్నా అడవి కొడుతున్నారు..

- ఇదివరకే అందరి పేరిట పట్టాలు
- జన్నారం ఎఫ్‌డీవో రామ్మోహన్


ఎఫ్‌డీవో రామ్మోహన్

జన్నారం: మంచిర్యాల జిల్లా జన్నారం అటవీ డివిజన్, ఇందన్‌పల్లి రేంజ్, కవ్వాల్ సెక్షన్ సానాపూర్ తండా పాలాఘోరీ ప్రాంతంలో అక్రమంగా ఆవాసాలు ఏర్పాటు చేసుకున్న ఆదివాసీ గిరిజనులకు ఇప్పటికే వారి పేరిట లావణి పట్టా భూములు, ఆర్‌వోఎఫ్‌ఆర్ భూములున్నాయని, అయినా అడవి కొడుతున్నారని జన్నారం ఎఫ్‌డీవో రామ్మోహన్ తెలిపారు. బుధవారం జన్నారం అటవీ డివిజన్ కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. ఒక్కొక్కరి పేరున 10 నుంచి 20 ఎకరాల వరకు లావణి పట్టా, ఆర్‌వోఎఫ్‌ఆర్ కింద భూములున్నాయని తేలిందని అన్నారు. నార్నూర్ మండలానికి చెందిన ఆత్రం భీంరావుకు లావణి పట్టా కింద 24.08 ఎకరాల భూమి ఉందన్నారు. సిర్పూర్ యూ మండలం పంగిడికి చెందిన ఆత్రం జంగుబాయి పేరున 10.15 ఎకరాల భూమి ఉందని తెలిపారు. ఇలా 15 మంది వివరాలు సేకరించామని, వీరిలో ముగ్గురి పేరున ఆర్‌వోఎఫ్‌ఆర్ హక్కు పత్రాలు, మిగతా 12 మంది పేరున లావణి పట్టాలున్నాయని తెలిపారు. ఇప్పటికే 26 మందిని అరెస్ట్ చేశామని, చట్ట విరుద్ధంగా అడవిలోనే ఉంటే వారిపై కూడా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. వెంటనే అడవి నుంచి ఖాళీ చేసి ఇళ్లకు వెళ్లాలని సూచించారు.